క్లుప్తంగా

16వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న గణేష్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని గరుగుబిల్లి మండలం, తోటపల్లి గ్రామానికి చెందిన గర్భిణి కోల్లు దివ్య ఆపరేషన్ నిమిత్తం జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం చేరింది. చికిత్స నిమిత్తం రక్తం అవసరమని వైద్యులు ఆమె బంధువులకు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద కార్యకర్త సింగిడి గణేష్ వెంటనే స్పందించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లి బ్లడ్‌బ్యాంకులో 16 వ సారి రక్త దానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడాడు. కార్యక్రమంలో పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద కార్యకర్త నందిగాన మునిసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగిడి గణేష్‌ను పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, పేషెంట్ బంధువులు అభినందించారు.

రహదారిని ఆక్రమిస్తే చర్యలు



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సీతారాం

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిని ఆక్రమించి ట్రాఫిక్ ఇబ్బందులకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై కె.సీతారాం హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి ఇరువైపులా పుట్‌పాత్ ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, దుకాణ దారులంతా పోలీసులకు సహకరించాలని కోరారు. రహదారికి ఇరువైపులా దుకాణాల ముందు వాహనాలు నిలడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపేవారికి అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కిశోర్, సంపత్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో జంగంబందలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ కె.రామచంద్రరావు శుక్రవారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశం వద్ద తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి, ఏపీఓ ఈశ్వరమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా స్ఫూర్తి మహిళా మండలి వార్షికోత్సవం



మండలి డైరెక్టర్ రాధను సన్మానిస్తున్న అతిథులు

సాలూరు: స్ఫూర్తి మహిళా మండలి ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ ఛైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, పట్టణ సీడీపీఓ సత్యవతి, తదితరులు పాల్గొని సంస్థ డైరెక్టర్ బలగ రాధను సన్మానించి అభినందించారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్ పర్యటన



పనులు పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ చీఫ్ శ్రీనివాస్

సాలూరు: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ చీఫ్ ఎస్.శ్రీనివాస్ సాలూరు పట్టణంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బంగారమ్మపేట, బంగారమ్మ కాలనీలలో జరుగుతున్న బాలుర, బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో జరుగుతున్న కిచెన్ కమ్ డైనింగ్ హాల్ పనులను పరిశీలించారు. ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్ కింద చెరో 50 లక్షల రుపాయలతో చేస్తున్న ఈ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఐటీడీఏ డీఈ మణిరాజ్, ఏఈఈ సంతోష్, తదితరులు ఉన్నారు.

మీరే జగనన్న సైనికులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు జగనన్న సైనికులని ప్రభుత్వం తలపెట్టిన 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాల అమలుపై విపరంగా తెలియజేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేటలోని కళింగ వైశ్య భవనం వద్ద గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు తావు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం వాటిని మీ ద్వారా ప్రజలకి మరింత చేరువయ్యేలా కార్యక్రమాన్ని రూపొందించిందని చెప్పారు. ఏ తలుపు తట్టినా మా నమ్మకం నువ్వే జగన్ అనే విధంగా ప్రజా మద్దతు పొందాలని సూచించారు. 110పథకాలను, 250రకాల సేవలను అందిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆశయం కార్యరూపం దాల్చేందుకు మనమందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. అందరి లక్ష్యం 2024ఎన్నికలేనని స్పష్టం చేశారు. గృహ సారథులను వలంటీర్లపై పెత్తనం చెలాయించడానికి వేయలేదని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ పథకాలను ఎవరందుస్తున్నారనేది తెలియపరిచేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఈ అనుభవం, సామర్థ్యం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్వతీపురంలో సమర్థవంతమైన నాయకత్వం

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని దీనిని వినియోగించుకుని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయదుందుభి మోగించాలని సూచించారు. ఇక ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు జగనన్న వల్లనే వస్తున్నాయని చెప్పాలన్నారు. సంక్షేమం అంటే ఏమిటో జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు చూస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘులత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, సర్పంచ్‌లు జి.అమ్మడమ్మ, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.పాపారావు, విజయ, ఎంపీటీసీలు రామకృష్ణనాయుడు, పెరికి బలిజ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ సలహాసంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు

గొర్రెలు, మేకలకు ఉచితంగా వ్యాక్సిన్

● యజమానులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ ఏడిఏ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: గొర్రెలు, మేకలకు ఉచితంగా వేస్తున్న పీపీఆర్ వ్యాక్సిన్‌ను పెంపకందారులు, కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ ఏడీఏ సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పెదభోగిలి పొలాల్లో పశువైద్య సిబ్బంది గొర్రెలు, మేకలకు వేస్తున్న పీపీఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి వస్తుందని గుర్తించిన ప్రభుత్వం పీపీఆర్ వ్యాధి నిరోధక టీకామందులు సమకూర్చడంతో గొర్రెలు మేకలున్న ప్రాంతాల్లో సిబ్బంది పర్యటించి వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు ఎస్.రామారావు, జి.గణేష్‌ల పర్యవేక్షణలో పశువైద్య అధికార సిబ్బంది రెండురోజుల్లో 420 గొర్రెలు, 730 మేకలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ఆవరణల్లోనే పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తామని ఈ అవకాశాన్ని గొర్రెలు, మేకల కాపరులు, యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకురాలు జి.జానకి, ట్రైనీ సహాయకురాలు హేమలత పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

సాలూరు: మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పట్టణంలోని మెంటాడవీధి కోదండరామ కల్యాణ మంటపంలో శనివారం శిక్షణ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొల్లిపల్లి త్రినాథ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

స్థల పరిశీలన

సాలూరు: మండలంలోని నెలిపర్తిలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సేకరించిన స్థలాన్ని ఆర్‌డీఓ హేమలత శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న చదును పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 11.3 ఎకరాల్లో జగనన్న ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. స్థానిక రైతుల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రైతులకు నష్టపరిహారం పెంపు విషయమై కలెక్టర్, అధికారులతో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కళ్లాల్లోని ధాన్యం తరలింపు

సీతానగరం: మండలంలోని రైతుల నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇంతవరకూ 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని బిల్లులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమఅయినట్లు ఏఓ ఎస్ అవినాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతులు ఖరీఫ్ సీజనులో ఉత్పత్తి చేసిన ధాన్యం 28 వేల మెట్రిక్‌టన్నులు కాగా ఇంతవరకూ 23 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. మిగిలిన 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉన్నట్లు రైతులు, వ్యవసాయ సిబ్బంది ద్వారా తెలుసుకున్నామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు రెండు రోజుల నుంచి కళ్లాల్లో ఉన్న ధాన్యం వెయ్యి మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 4వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం తరలించడానికి చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

● పట్టణ సీఐ శ్రీనివాసరావు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సీఐ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, తదితరులు

సాలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ అధ్యక్షతన చట్టాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే చెడు అలవాట్ల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో మష్రూమ్ కల్టివేషన్ సర్టిఫికెట్ కోర్సులో 40 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

'ఈ' పంటనమోదు, రీసర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వీఆర్‌వోలు వైఎస్‌ఆర్ జగనన్న సంపూర్ణ భూ రక్ష, భూ హక్కు రీసర్వేతో పాటు ఈ పంటనమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సంపూర్ణ రీసర్వే, ఈ పంటనమోదు, విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల మంజూరు వేగవంతంపై సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1,2 విడతల్లో రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో భూముల వివరాలను సేకరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న శాఖాపరమైన అంశాలను ప్రజలకు తెలియ జేయాలని కోరారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలతో పాటు, ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ షేక్ ఇబ్రహీం, రీసర్వే విభాగం డీటీ చిట్టెమ్మ, ఆర్‌ఐ పి కరుణాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వానికి నిధులు కేటాయించాలి



ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌తో ఎమ్మెల్యే జోగారావు ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ ద్వారా నిధులు ప్రత్యేకంగా కేటాయించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థల పరిశీలన



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలో నిర్వహించనున్న గృహ సారథుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హాజరు కానున్న సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు సభాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం వెంకంపేట గ్రామంలో వైజంక్షన్ వద్ద సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు మొదటి విడత శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, జక్కు ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ తీళ్ల శివున్నాయుడు, నాయకులు మజ్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీసీకి రైతుల ఫిర్యాదు



ఎస్‌డీసీకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

మెంటాడ: సక్రమంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) ఎ.సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ధాన్యం కొనుగోళ్లపై ఆరాతీశారు. అనంతరం ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదని పలువురు రైతులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఎక్కడా ఎటువంటి అక్రమాలు జరగకుండా, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఎస్‌డీసీ ఆదేశించారు.

గృహసారథులే గెలుపు వారధులు



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

● రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మెంటాడ: గృహసారథులే వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని చల్లపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పారదర్శకంగా లబ్ధిదారునికి చేరాలన్న సదుద్దేశ్యంతోనే వలంటీర్లను నియమించడం జరిగిందని, ప్రభుత్వం చేసే ప్రతీ మంచి పని ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతోనే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం వల్ల ప్రజలకు చేకూరిన మేలును ఇంటింటికీ వెళ్లి, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వివరించాలని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం గృహసారథులు ఎలా పనిచేయాలన్న దానిని స్క్రీన్‌పై ఓ వీడియో ప్లే చేసి, వివరించారు. అన్ని మండలాల్లో కన్నా మెంటాడలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. ఒక్క మెంటాడలోనే వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో వారం రోజుల్లోనే నగదు జమ చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైనికులైన గృహసారథులు ప్రతీ ఇంటికి ఆయన చేసిన మంచిని వివరించి, పార్టీ గెలించేందుకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు, జెడ్పీటీసీ ఎల్.సన్యాసప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు గృహసారథుల మండల కన్వీనర్ కె.త్రినాథరావు, సర్పంచ్ టి.తనూజ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మెరుగైన వైద్యసేవలు



మంచంపై ఉన్న రోగుల ఆరోగ్య సమస్యలపై సూచలు ఇస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలుచేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఇళ్ల వద్దనే మెరుగైన వైద్యసేవలు అందించడంలో సంతృప్తి చెందుతున్నామని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం దయానిధిపురం గ్రామంలో 104 వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. దయానిధి పురంలో అందుతున్న ఆరోగ్య పరీక్షలు, తనిఖీలు, అందుతున్న వైద్యసేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, సీజనల్‌వారీగా వస్తున్న వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఇళ్ల వద్దనే వైద్యసేవలు అందిస్తున్నామని, క్షేత్రస్థాయిలో కదలలేని స్థితిలో ఉన్న రోగులకు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది ఇళ్లకు చేరినవారి ఆరోగ్య పరిశీలిస్తున్నామని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లలకు, పాఠశాలల్లో పిల్లలకు ఆరోగ్య తనిఖీలు తదితర వైద్య సేవలందిస్తూ పలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి రోగుల గృహసందర్శన చేసి పలువురిని పరిశీలించారు. రోగులకు వైద్యసిబ్బంది అవసరమైన తనిఖీలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్యసిబ్బంది. ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రైడే ప్రధానం



కాలువల్లో తీస్తున్న పూడికలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఫ్రైడేను (శుక్రవారం) డ్రైగా పాటిస్తూ దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చినభోగిలిలో సర్పంచ్ కురమాన రాధ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కార్యదర్శి బి.మనోహర్ నిర్వహించగా పరిశీలించి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా చెత్తకుప్పలను తొలగించడం, కాలువల్లో పూడికలు తీయించడం, వీధుల్లో పారేసిన ఖాళీ కొబ్బరి బురికెలు, వాహనాలనుంచి తీసేసిరోడ్డు పక్కనే పడేసిన టైర్లు దూరప్రాంతాలకు తరలించి మంట పెట్టినట్లు తెలిపారు. ప్రధానంగా దోమలకు స్థావరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు సత్వరచర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. దోమల నివారణతోనే ప్రజలకు వ్యాధుల బారి నుంచి విముక్తి కల్పించవచ్చన్నారు. అలాగే అంటిపేటలో కాలువల్లో పూడికలు తీయించడం, దోమల నివారణకు మందులు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఎం, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులతో ఇంజినీరింగ్ సహాయకులు వేగవంతం చేయించి పూర్తి చేయాలని మండలపరిషత్ ఏఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ జానకీరాం అధ్యక్షతన సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో ఇళ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఇళ్లను మంజూరుచేసినప్పటికీ నిర్మాణాలు చేయడంలో అలసత్వం వహించడం వల్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న వారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు బ్యాంక్ ఖాతాలకు జమచేస్తుందని, రాయితీపై ముడుసరుకులు సమకూర్చడంతో పాటు వెలుగు ద్వారా స్వల్ప వడ్డీపై రూ 35 వేలు రుణం సమకూరుస్తోందని తెలియజేశారు.ఏఈ జానకీరాం మాట్లాడుతూ గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో సిమెంట్, విద్యుద్దీకరణ సామగ్రి లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. తామరఖండి జగనన్న లేఅవుట్‌లో మంచినీరు కొరతుందని చెప్పడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో చర్చించి మంచి నీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మార్‌నగరంలో గల స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు మారిటెక్ కంపెనీలో ఉపాధి కల్పిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఎప్పటికప్పుడు జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పరిపాలన వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల అభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకుని గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న యువత ఉద్యోగాలు పొందేందుకు కావలసిన నైపుణ్యం పెంపొందించేందుకు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

జిల్లా కేంద్రంలో మోడరన్ కెరియర్ సెంటర్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు జిల్లా కేంద్రంలో మోడరన్ కెరియర్ సెంటర్‌ను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని నిరుద్యోగ యువతకు అది ఎంతగానో ఉపయోగ పడుతుందని, మీరంతా సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారిణి అరున కుమారి, జిల్లా జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి రవీంద్ర, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయికుమార్, స్థానిక ఎంపీటీసీ బడే రామారావు, సర్పంచ్‌లు వంగపండు త్రినాథనాయుడు, ప్రవీణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, నాయకులు మజ్జి శేఖర్, బి.కృష్ణమూర్తి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.